తప్పని యూరియా తిప్పలు

యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం 4 గంటల నుంచి లైన్‌లో నిలబడ్డారు. వారం రోజులుగా యూరియా లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నశంకరంపేట మండలం జంగరాయి సహకార సంఘం వద్దకు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయమే చేరుకొని క్యూలైన్‌లో చెప్పులు పెట్టారు. చిన్నశంకరంపేట సహకార సంఘం వద్ద బారుతీరిన రైతులు గంటల కొద్ది వేచిచూశారు. అయితే మహిళల మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఒక మహిళ రెండుసార్లు లైన్‌లో నిలబడి ఎక్కువ బస్తాలు తీసుకుందని మరో మహిళ ఆమెపై చేయి చేసుకుంది. పక్కన ఉన్న మహిళలు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. కొల్చారం మండలంలోని రంగంపేట రైతు ఆగ్రో సేవా కేంద్రానికి 400 బస్తాల యూరియా వచ్చింది. రైతు వేదిక వద్ద టోకెన్లు ఇవ్వడంతో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

– వెల్దుర్తి(తూప్రాన్)/కొల్చారం(నర్సాపూర్)/చిన్నశంకరంపేట(మెదక్)


చిన్నశంకరంపేట: క్యూలో చెప్పులు


కొల్చారం: ఆగ్రో సేవా కేంద్రం ఎదుట రైతుల క్యూ


వెల్దుర్తి: యూరియా కోసం బారులు

క్లుప్తంగా

తాగి వాహనాలు నడిపితే జైలుకే..

ఎస్‌ఐ శంకర్ హెచ్చరిక


మాట్లాడుతున్న ఎస్‌ఐ శంకర్

అల్లాదుర్గం(మెదక్): మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్‌ఐ శంకర్ హెచ్చరించారు. గురువారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి శుక్రవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే మొదటిసారి జరిమానా విధిస్తామన్నారు. మళ్లీ పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుని కుటుంబాలు వీధిన పడుతున్నాయని చెప్పారు. వాహనదారులు మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు.

పీఏపీఎస్ చైర్మన్‌గా నరసింహారెడ్డి


నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న సీఈవో, డైరెక్టర్లు

టేక్మాల్ (మెదక్): టేక్మాల్ పీఏపీఎస్ చైర్మన్‌గా ధనూర గ్రామానికి చెందిన బి.నరసింహారెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం టేక్మాల్ పీఏపీఎస్ కార్యాలయంలో సీఈఓ సాయిలు సమక్షంలో డైరెక్టర్లు నరసింహారెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఇదివరకు పీఏపీఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డిపై వేసిన విచారణలో అవినీతి చేసినట్లు నిర్ధారణ కావడంతో ఆయనను తొలగించారు. దీంతో నూతన చైర్మన్‌గా నరసింహారెడ్డిని ఎన్నుకున్నారు.

పుస్తకాలు సమకూరుస్తా

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి


సుహాసినిరెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

నర్సాపూర్: పోటీ పరీక్షలకు చదివేందుకు అవసరమయ్యే పుస్తకాలు సమకూరుస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి చెప్పారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర ఫైన్ ఆర్ట్స్ కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమయ్యే పుస్తకాలు సమకూరుస్తానని సుహాసినిరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిబ్బంది సుహాసినిరెడ్డిని శాలువతో సన్మానించారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

హవేళిఘణాపూర్(మెదక్): జిల్లా స్థాయిలో జరిగిన టీఎల్‌ఎం మేళాలో అద్భుతమైన టీఎల్‌ఎం తయారు చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులను ఎంఈఓ మధుమోహన్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో పని చేస్తున్న రవీందర్‌రెడ్డి, బాలశేఖర్, జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు పొందిన నర్సింలును అభినందించారు. విద్యార్థులకు మంచి బోధన చేసి ప్రతిభ కనబర్చి ఎంపిక కావడం శుభపరిణామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

అనుమతి లేకుండా చెట్లు నరికివేస్తే చర్యలు



తూప్రాన్: మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా చెట్టు కొమ్మలు నరికిన వ్యాపార సంస్థకు శుక్రవారం మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. పట్టణంలోని మోర్ వ్యాపార సంస్థ ఎదుట చెట్టు కొమ్మలు అడ్డుగా ఉన్నాయని నిర్వాహకులు నరికివేశారు. గుర్తించిన మున్సిపల్ అధికారులు ఆ వ్యాపార సంస్థకు రూ. 5 వేల జరిమానా విధించారు. అనుమతి లేకుండా చెట్లు నరికివేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

- ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విద్యాసాగర్
- రాయిలాపూర్‌లో శిబిరం ఏర్పాటు


మాట్లాడుతున్న విద్యాసాగర్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవాటు చేసుకోవాలని ఓయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయిలాపూర్‌లో నర్సాపూర్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో యూనిట్-1 ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని చెప్పారు. ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద, జ్యోతిబాపూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. గ్రామస్తులకు మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, వరకట్న దురాచారం గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సరిత, రాజ్‌కుమార్, వాలంటీర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


అమరేందర్‌రెడ్డి

నర్సాపూర్: తమ కళాశాలలోని ఏఐడీఎస్ బ్రాంచ్‌లో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అమరేందర్‌రెడ్డికి డాక్టరేట్ వచ్చిందని బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తెలిపారు. అమరేందర్‌రెడ్డి విజయవాడకు చెందిన కేఎల్‌ఈఎఫ్ విశ్వవిద్యాలయం నుంచి సీఎస్ఈ విభాగంలో మెటీ-హ్యూరిస్టిక్ విధానాల ఆధారంగా శక్తి సమర్థవంతమైన మేఘ గణన అంశంపై డాక్టరేట్ పొందారని ఆయన వివరించారు. కాగా అమరేందర్‌రెడ్డిని ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మిప్రసాద్, హెచ్ఓడీ దశరథరామయ్య తదితరులు అభినందించారు.

ఇసుక మేటలు తొలగిస్తాం

నార్సింగి ఎంపీడీఓ ఆనంద్‌కుమార్


ఇసుక మేటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చిన్నశంకరంపేట(మెదక్): పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలను ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు నార్సింగి ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నార్సింగి మండలం జప్తిశివనూర్ గ్రామంలో భారీ వర్షాలతో పంట పొలాల్లో చేరిన ఇసుక మేటలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రైతుల పంట పొలాలను పరిశీలించి కూలీల అవసరాలపై ఒక అంచనాకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రాజేశ్వర్, ఏఈఓ దివ్య ఉన్నారు.

భాష, యాసను మరవొద్దు

జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం దీప్లారాథోడ్


కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ భాషా యాసను మరిచిపోవద్దని చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం దీప్లారాథోడ్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాలలో తెలంగాణ భాషా తెలుగుపై టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు పండిత్‌లు వసుందదేవి, మంజుల, కిషన్‌లను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పోచయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రభుత్వ వైద్యాధికారి క్రాంతికుమార్

పాపన్నపేట(మెదక్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాపన్నపేట ప్రభుత్వ వైద్యాధికారి క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని చీకోడ్ లింగాయిపల్లి బాలుర వసతి గృహంలో వైద్య శిబిరంతో పాటు తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాస్, ఏఎన్ఎం సరిత, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూటీఎస్ కార్యవర్గం


వెంకటకృష్ణ


మహేష్‌కుమార్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎస్‌టీయూటీఎస్ చిలప్‌చెడ్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మహేష్‌కుమార్, కోశాధికారిగా నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శిగా సుభాష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్, అదనపు కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ముమ్మరంగా ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు


శివ్వంపేట ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందిన వారు

శివ్వంపేట(నర్సాపూర్): పది, ఇంటర్‌లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. శివ్వంపేట ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్‌కు సంబంధించి పదిలో 25, ఇంటర్‌లో 35 మంది ప్రవేశాలు పొందినట్లు ఓపెన్ స్కూల్ మండల కో ఆర్డినేటర్ బాలచంద్రం తెలిపారు. గ్రామాల్లో చదువు మానేసిన వారిని గుర్తించేందుకు ఐకేపీ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల ప్రవేశాలు పెరిగాయని బాలచంద్రం చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఐకేపీ సీసీ సరిత, తదితరులు ఉన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు


తూప్రాన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీ నాయకులు

తూప్రాన్: పట్టణంలో మైనార్టీ సోదరులు మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వరకు ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. మైనార్టీలు ప్రతి ఏటా ఈ పండుగను సంతోషంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందని, ఈ పండుగ విశిష్టతను మత పెద్దలు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ శివానందం బందోబస్తు చేపట్టారు.

ముస్లింల ర్యాలీ

మనోహరాబాద్(తూప్రాన్): మిలాద్-ఉన్-నబీ వేడుకలలో భాగంగా మనోహరాబాద్, కాళ్లకల్ ముప్పిరెడ్డిపల్లి, పర్కిబండ, లింగారెడ్డిపేట్‌లో ముస్లింలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మనోహరాబాద్‌లో నిర్వహించిన ర్యాలీలో ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ అధ్యక్షుడు జావీద్‌పాషా, కమిటీ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, సభ్యులు సమద్, నయిమ్, రజాక్, రఫీక్, షర్ఫుద్దీన్, మహ్మద్‌బేగ్, సంయుద్దీన్, గౌస్, ఫహీం, ఉస్మాన్, గులాం, జిలానీ, మోయిజ్, అఫ్సర్, ఇర్షాద్, అజ్జు, లాయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం అల్లాదుర్గం ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని. వార్డెన్ కిషోర్ చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ టిక్యా గూడెం తొలి మాజీ సర్పంచ్ మృతి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని టిక్యా దేవమ్మగూడం మాజీ సర్పంచ్ తుక్యానాయక్(70) శుక్రవారం ఉదయం మృతిచెందాడు. టిక్యా దేవమ్మగూడం గ్రామ పంచాయతీ మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. మృతదేహానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు చంద్రగౌడ్, పెంటయ్యగుప్తా, శ్రీశైలంయాదవ్, భిక్షపతి, అంజి, రాజేందర్‌నాయక్, రవినాయక్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

◆ నిర్దేశించిన పనులు త్వరగా పూర్తి చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం నిర్దేశించిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. సికింద్లాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం రూ.3 లక్షల ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సామూహిక మరుగుదొడ్ల పనులు, పెద్దగొట్టిముక్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి సూచనలు చేశారు.

ఏచూరి ఆశయాలను సాధిస్తాం

సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ


మెదక్ కలెక్టరేట్: ఏచూరి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు

మెదక్ కలెక్టరేట్: దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ పేర్కొన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా మెదక్ కేవల్ కిషన్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఏచూరి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రజల హక్కుల కోసం ఏచూరి చేసిన అనేక పోరాటాల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలను ఐక్యం చేసి భవిష్యత్‌లో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, నాయకులు సంతోష్, వెంకట్, చౌకత్, సత్యం, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరీ మొదటి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫొటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రపంచ, దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి ప్రత్యేక ముద్ర వేసుకున్న రాజకీయ నాయకుడిగాను, మంచి పార్లమెంటేరియన్‌గా పేరు పొందారని పలువురు నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గౌరి, సాయిలు, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

- తప్పిన ప్రమాదం
- అధికారుల నిర్లక్ష్యమే కారణం


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలు

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు చెలరేగి తృటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన అల్లాదుర్గం మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు వెలిశాయి. ట్రాన్స్‌ఫార్మర్ పైకి తీగలు అల్లుకున్నాయి. వీటిని తొలగించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఆగస్టు 8న సాక్షి దినపత్రికలో ‘పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అయినా విద్యుత్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించారు. స్థానికంగా అధికారులు ఎవరూ ఉండటం లేదని, ప్రతీసారి ప్రమాదాలు చోటు చేసుకుంటే గంటల తరబడి వారి కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు మండిపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదలు వెలిసి ప్రమాదకరంగా మారితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పొదలతో ట్రాన్స్‌ఫార్మర్ కనిపించలేని పరిస్థితి నెలకొనడంతో మూగజీవాలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి ఉద్బోధ


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

చేగుంట(తూప్రాన్): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల చేరిన విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కొత్త విద్యార్థులు సీనియర్ విద్యార్థులు కలిసిమెలిసి చదువుకోవాలని పేర్కొన్నారు. కళాశాలకు అదనపు గదులు, ప్రహరీ, నిర్మించడంతో కళాశాల సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలని శ్రీనివాస్‌రెడ్డిని ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి కోరారు. ఇన్‌చార్జి మంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాలలో పంటలు దెబ్బతిన్నాయని ఎంపీడీఓ షాకీర్‌అలీ అన్నారు. శుక్రవారం బద్దారం, ఉత్తులూర్ తదితర గ్రామాలలో ఈజీఎస్ అధికారులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంటలలో ఇసుక మేటలను తొలగించుకునేందుకు ఉపాధిహామీ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఆయా గ్రామాలలో డ్రై డే సందర్భంగా ప్రజలకు నీటి నిల్వ, రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వినీత్, ఈసి.నవాజుద్దీన్, టీఏ వినోద, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

17 నుంచి సేవా కార్యక్రమాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్


మాట్లాడుతున్న మల్లేష్‌గౌడ్

నర్సాపూర్: ఈనెల 17నుంచి పక్షం రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని పుట్టిన రోజు నుంచి అక్టోబరు రెండవ తేదీ వరకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. రక్తదాన శిబిరాలు, అమ్మ పేరుతో మొక్కలు నాటడం, కుల వృత్తులు, రిటైర్డు ఉద్యోగులను సన్మానించడం, ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంచడం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన వివరించారు. సమావేశంలో పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నగేష్, పార్టీ నాయకులు నారాయణరెడ్డి, బాల్‌రాజ్, రాములు నాయక్, నర్సింలు, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాసంపల్లి చెరువు గండికి మరమ్మతులు


చెరువుకు గండిని పూడ్చుతున్న ఇరిగేషన్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని కాసంపల్లి చెరువు తూముకు పడిన గండికి ఇరిగేషన్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం సాక్షి పత్రికలో ‘కాసంపల్లి చెరువు తూముకు గండి’ శీర్షికన వచ్చిన కథనంతో స్పందించిన ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్.. తన సిబ్బందితో చెరువు గండికి మరమ్మతులు చేపట్టారు. తూము వద్ద గండిని గుర్తించి ఇసుక బస్తాలు, మట్టితో కలిపి గండిని పూడ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అదే ఉపాధ్యాయులకు పెద్ద గౌరవం

ఎంఈఓ మల్లేశం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఎంఆర్‌సీ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరినప్పుడే ఉపాధ్యాయులకు దక్కే పెద్దగౌరవమని ఎంఈఓ మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలం కేంద్రంలో ఎంఆర్‌సీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఎన్నికైన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మాంచి, వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండల స్థాయిలో ఆయా పాఠశాలల నుంచి 25 మంది ఉపాధ్యాయులను గుర్తించామన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264